# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 27 సెప్టెంబర్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 56

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# మరోమారు ట్రంప్ సుంకాల బాదుడు

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాలతో విరుచుకుపడ్డారు. ఫార్మా దిగుమతులపై భారీగా సుంకాలు విధిస్తూ బాంబు పేల్చారు. బ్రాండెడ్, పేటెంట్ ఉన్న ఔషధ ఉత్పత్తుల దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. అమెరికాలో ప్లాంట్‌లను నిర్మిస్తున్న విదేశీ ఔషధ తయారీ సంస్థలకు ఈ సుంకాలు వర్తించవని పేర్కొన్నారు.అదేవిధంగా అప్‌హోల్స్టర్డ్ ఫర్నిచర్‌పై 30 శాతం, భారీ ట్రక్కులపై 25 శాతం దిగుమతి సుంకాలు విధించనున్నట్లు వెల్లడించారు. అలాగే కిచెన్ క్యాబినెట్, బాత్‌రూమ్ వానిటీలపై 50 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు- చెప్పారు. ఈ నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి తీసుకొస్తామన్నారు. జాతీయ భద్రతతో పాటు- ఇతర కారణాలను పరిగణనలోకి తీసుకుని ఈ టారిఫ్‌లు విధిస్తున్నట్లు- తన సోషల్ మీడియా మాధ్యమం ట్రూత్ ద్వారా ట్రంప్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు తీసుకున్న ఈ నిర్ణయంతో భారతీయ ఫార్మా పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. భారత ఫార్మా కంపెనీలకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ మొత్తంగా 27.9 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసింది. ఇందులో 8.7 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు అమెరికాకే ఎగుమతి అయ్యాయి.



# హైదరాబాద్‌లో కుండపోత వర్షం..

## భారీ వర్ష సూచన.. తెలంగాణ వ్యాప్తంగా రెడ్ అలర్ట్

హైదరాబాద్: మహారాష్ట్ర నుంచి తెలంగాణ, కర్ణాటక మీదుగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో తెలంగాణలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో 21 సెం.మీకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. మరోవైపు బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారింది.వాయవ్య, మధ్య బంగాళాఖాతం సమీపంలో పూరీ తీరానికి దక్షిణ ఆగ్నేయంగా 60కి.మీ దూరంలో, గోపాల్‌పూర్‌నకు తూర్పుదిశలో కేంద్రీకృతమైంది. క్రమంగా వాయవ్య దిశగా పయనిస్తోంది. పూరీ, కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, అన్ని జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఆయా జిల్లాల్లో 12 నుంచి 20 సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. రాయలసీమలో 5-10 సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. తీరం వెంబడి గంటకు 40- 60కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది



# హైదరాబాద్ వర్షానికి మూసీకి వరద

## మూసారాంబాగ్ వద్ద రాకపోకలు నిషేధం

## మంచిరేవుల వద్ద నిలిచిపోయిన రాకపోకలు

# నూతన డిజిపిగా శివధర్ రెడ్డి




**హైదరాబాద్:** తెలంగాణ నూతన డీజీపీగా శివధర్ రెడ్డిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఉన్నారు శివధర్ రెడ్డి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ఇంటలిజెన్స్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. శివధర్ రెడ్డిని నియమిస్తూ ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు.




- బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జిఓ జారీ
- కమిటీ సిఫారసులను ఆమోదించిన ప్రభుత్వం
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు
- ఉన్నతాధికారులతో ఎన్నికల సంఘం భేటీ

# రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

ఈ మ్యాట్రిక్స్ ప్రకారం, గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తులు , జిల్లా పరిషత్తులు లో కోటాలు నిర్ణయిస్తారు. జీవో విడుదలైనందున వెంటనే పంచాయతీ రాజ్ విభాగం కు సిఫార్సు చేస్తుంది. ఒకటి లేదా రెండు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తుంది




- బీసీ రిజర్వేషన్లపై ఉత్తర్వుల నేపథ్యంలో మార్గం సుగమం
- అధికారులతో సమీక్షించిన సీఎం
- ఒకటి, రెండు రోజుల్లో షెడ్యూల్!

# మోగనున్న 'స్థానిక' నగారా!

వార్డులు, గ్రామాలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, స్ట్రాంగ్ రూంలు, ఎన్నికల సిబ్బంది వివరాలను అధికారులు తెలియజేయనున్నారు. దీని ఆధారంగా ఎన్నికల సంఘం షెడ్యూల్‌పై నిర్ణయం

# కెసిఆర్‌కు రుణపడి ఉంటా: మాగంటి సునీత




హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీతను గులాబీ బాస్ కేసీఆర్ ప్రకటించారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాగంటి సునీత మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎవరైనా టికెట్ ఆశించవచ్చుని... కానీ తనమీద నమ్మకంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ టికెట్ ఇచ్చారని చెప్పుకొచ్చారు. కేసీఆర్ చేసిన అభివృద్ధే తనను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాను ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికల్లో పోటీ- చేయాల్సి వస్తోందని ఎప్పుడూ అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు మాగంటి సునీత. తన భర్త మాగంటి గోపీనాథ్ పోటీ- చేసినప్పుడు బ్యాగ్రౌండ్ వర్క్ చేశానే తప్పా... బయటకు రాలేదని చెప్పుకొచ్చారు. తన భర్త గోపీనాథ్ మరణాన్ని ఇప్పటికీ జూబ్లీహిల్స్ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రజలకు గోపీనాథ్ పెద్ద కొడుకుగా ఎప్పుడూ అందుబాటు-లో ఉండేవారని స్పష్టం చేశారు. పార్టీలో అందర్నీ కలుపుతూ ముందుకు వెళ్తానని వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకత్వం మద్దతుతోనే ఇక్కడి వరకూ వచ్చానని క్లారిటీ- ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను తన భర్త గోపీనాథ్ పటిష్టంగా తయారు చేశారని మాగంటి సునీత పేర్కొన్నారు.

# ఓజి సినిమా టిక్కెట్ ధరల పెంపు వీల్లేదు

## సింగిల్ జడ్జి ఆదేశాలను సమర్థించిన హైకోర్టు

**హైదరాబాద్ :** పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఓజీ' మూవీ టికెట్ ధరల పెంపుపై తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. టిక్కెట్ ధలు పెంచేందుకు నిరాకరించింది.. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమాకు తెలంగాణ హైకోర్టు మరోసారి షాకిచ్చింది. రివ్యూ తర్వాత కూడా పెంపునకు న్యాయస్థానం అంగీకరించలేదు. 'ఓజీ' బెనిఫిట్ షోలకు, ఆ సినిమా టికెట్ రేట్లను పెంచుకునేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ గతంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన



ఉత్తర్వులే కొనసాగుతాయని స్పష్టం చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులే అక్టోబర్ 9వ తేదీ వరకు కొనసాగుతాయని హైకోర్టు స్పష్టం చేసింది. టికెట్ రేట్లు- ఎందుకు పెంచాలని అనుకున్నారో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 9వ తేదీకి వాయిదా వేసింది. ఓజీ సినిమా టికెట్ల ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఇప్పటికే హైకోర్టు సింగిల్ బెంచ్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై ఇటీ- వల విచారణ జరిపిన సింగిల్ బెంచ్.. 'ఓజీ' బెనిఫిట్ షోల ద్వారా వచ్చే రాబడిని వీధి పిల్లలు, అనాథల సంక్షేమం కోసం ఖర్చు చేస్తారా? అని నిలదీసింది. 'ఓజీ' బెనిఫిట్ షోలను, ఆ సినిమా టికెట్ రేట్ల పెంపుదలను నిలిపివేస్తున్నట్లు- ప్రకటించింది. 'ఓజీ' సినిమా టికెట్లను 18 ఏండ్లలోపు వారికి విక్రయించ కుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వేగుచుక్క

# నేటి మహిళలకు "చాకలి ఐలమ్మ" ఆదర్శం.

## అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**





ఆనాడు రజాకార్లను, దొరలను ఎదిరించి పోరాడిన చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు నేటి మహిళలకు ఆదర్శం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ధన్ పాల్ హాజరయ్యారు. బిజెపి ఓబీసీ మోర్చా నాయకులతో కలిసి వినాయక్ నగర్ లో గల ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనలో దొరలు, భూస్వాములు, పెత్తందారులు బడుగు, బలహీన వర్గాల ప్రజలను వెట్టిచాకిరీ చేపిస్తు బానిసలుగా చూస్తున్న రోజుల్లో చాకలి ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం దున్నేవాడిదే భూమి అంటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా విస్నూర్ దేశ్ ముఖ్ ను ఎదిరించిన తెలంగాణ వీర వనిత సాకాలి ఐలమ్మ అని అన్నారు. రాణి రుద్రమ్మ పౌరుషన్నిపాలు పంచుకున్న ఓరుగల్లు ముద్దు బిడ్డ సాకాలి ఐలమ్మ ఆనాడు ఆమె పండించిన పంటను దొర గుండాలు అక్రమంగా తీసుకెళ్తుంటే ఎదురు తిరిగి గుండాలను తరిమి కొట్టిన ఆమె విజయం తెలంగాణలో భూ పోరాటానికి నాంది పలికెల చేసిందన్నారు.సాకాలి ఐలమ్మ స్ఫూర్తి నేటి మహిళా లోకానికి ఆదర్శం అని, ఆడది అంటే అభల కాదు ఆది పరశక్తి అని రుజువు చేసిన దీర వనిత సాకాలి ఐలమ్మ అన్నారు. ఆడవాళ్లు అంటే వంటింటి కుందేళ్లు అనుకునే సమాజంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ గారు మహిళా రిజర్వేషన్ బిల్ తెచ్చి యావత్ మహిళా లోకాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకుపోయే లక్ష్యంతో బిజెపి పనిచేస్తుందని అన్నారు.ఆపరేషన్ సిందూర్ లో ఇద్దరే మహిళలు ఖురేషి, వ్యోమిక ఉగ్రస్తావరాలను ధ్వంసం చేసి భారతీయ మహిళా నారీ శక్తి అంటే ఏంటో ప్రపంచానికి నిరూపించారని అన్నారు. నేటి మహిళలు సాకాలి ఐలమ్మ, రాణి రుద్రమ్మ, ఝాన్సీ లక్ష్మి భాయ్ లాంటి వీర వనితల పోరాట స్ఫూర్తితో వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అవరోదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నాగోళ్ళ లక్ష్మినారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు స్వామి యాదవ్, గిరి బాబు, నాగరాజు, బుస్సాపూర్ శంకర్ బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బహుజన సమాజానికి ధైర్యం "చాకలి ఐలమ్మ".

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.



**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, సెప్టెంబర్ 26**

: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని ఆర్ అండ్ బి కార్యాలయం ఎదురుగా గల ఆమె విగ్రహానికి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ కతెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రతీక అని, బహుజన సమాజానికి ధైర్యం, పోరాటస్ఫూర్తి నింపిన మహనీయురాలు. ఆమె త్యాగం, వీరస్వభావం తరతరాలకు ఆదర్శం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్లు, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్ , సహాయ బీసీ అభివృద్ధి అధికారి చక్రధర్, బహుజన సంఘాల నాయకులు కొత్తపల్లి మల్లయ్య, రాజయ్య, శ్రీకాంత్, స్వామి, పవన్, అశ్వక్, నరేష్, టిఎన్జిఓస్ జిల్లా అధ్యక్షులు వెంకటరెడ్డి, కార్యదర్శి నాగరాజు, బీసీ సంఘం నాయకులు శివరాములు, శంకర్, రజక సంఘం నాయకులు, జిల్లా అధికారులు మరియు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో అంబరాన్నంటిన "బతుకమ్మ" సంబురాలు.












## - పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, సీ.పీ.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 26**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ వేడుకకు అట్టహాసపు ఏర్పాట్లు చేశారు. శాసన సభ్యులు డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి, దన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి తదితరులతో పాటు యావత్ జిల్లా యంత్రాంగం భాగస్వాములైన ఈ వేడుకతో కలెక్టరేట్ ప్రాంగణం సరికొత్త శోభతో ఉట్టిపడింది. రంగు రంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒక చోటకు చేర్చి, గౌరీ మాతను స్తుతిస్తూ మహిళలు లయబద్ధంగా చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మహిళలు ఆలపించిన గేయాల బతుకమ్మ ప్రాశస్త్యాన్ని చాటి చెప్పాయి. ప్రకృతిని ఆరాధించే ఈ వేడుక ఔన్నత్యం ఆవిష్కృతం అయ్యేలా, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అనే తేడా లేకుండా మహిళా ఉద్యోగులు, ఐ కే పీ, మెప్మా మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ వేడుకకు వన్నెలద్దారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎంతో ఉత్సాహంగా ఆడిపాడారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్, సీ.పీ గౌరీమాతకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ ప్రాధాన్యతను ఇనుమడింపజేశాయి. సాయంత్రం 3.30 గంటల నుండి రాత్రి వరకు కూడా ఏమాత్రం అలసట చెందకుండా మహిళలు ఎంతో హుషారుగా బతుకమ్మ ఆడుతూ, తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. దేదీప్యమానమైన విద్యుత్ దీపాల వెలుగులలో, అందంగా అలంకరించుకుని నూతన దుస్తుల్లో బతుకమ్మలతో తరలి వచ్చిన అతివలతో కలెక్టరేట్ ప్రాంగణం అంతా సరికొత్త శోభను సంతరించుకుని అందమైన దృశ్యాన్ని ఆవిష్కరింపజేసింది. దాండియా, కోలాటాలు, బతుకమ్మ ఆటపాటలతో ఎటు చూసినా సందడి వాతావరణం కనిపించింది. ఈ వేడుకలకు విచ్చేసి విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులకు, మహిళలకు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలలో అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.








# కులాంతర వివాహాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.






**సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో కుల నిర్మూలన కోసం పోరాడుదాం.**

**సిపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

కులాంతర వివాహాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలనీ, సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో కుల నిర్మూలన కోసం పోరాడుదాం అని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అన్నారు. మహాత్మ జ్యోతిభాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పార్టీ నిజామాబాద్ అర్బన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "కుల నిర్మూలన సదస్సు"ను కోటగల్లీలోని జిల్లా పద్మశాలి భవన్ లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిభాపూలే కుల వ్యవస్థకు వ్యతిరేకంగాను, దాని నిర్మూలన లక్ష్యంగాను 1873 సెప్టెంబర్ 24న సత్యశోధక్ సమాజ్ ను ఏర్పరిచారన్నారు. సెప్టెంబర్ 24 నుండి 30 వరకు కుల నిర్మూలన చైతన్య సదస్సులు, సమావేశాలు జరుపుతున్నామన్నారు. మన దేశంలో కుల వ్యవస్థ సామాజిక ప్రజాస్వామ్యానికి, రాజకీయ ప్రజాస్వామ్యానికి ప్రత్యక్షంగా వ్యతిరేకంగానూ, ఆటంకంగాను ఉన్నదన్నారు.

కులాంతర వివాహాల వల్లనే కుల నిర్మూలన లక్ష్యం సాకారమౌతుందన్నారు. కులాంతర, మతాంతర, ప్రేమ వివాహాలను ప్రభుత్వాలు, పౌర సమాజం ప్రోత్సహించాలన్నారు. కులాంతర, ప్రేమ వివాహాలు చేసుకున్న వారిపై పరువు పేరుతో హత్యలు, దాడులు చేయడం గత 12 సంవత్సరాలుగా తీవ్రమైందన్నారు. ఎందుకు ఆర్ఎస్ఎస్, బిజెపి శక్తుల కుల, మతోన్మాద రాజకీయాలే కారణమన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు రక్షణ కరువైందన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రోత్సాహకాలు అందించడంలో పాలకవర్గాలు తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. కులాంతర, మతాంతర, ప్రేమ వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం, పోలీసులు రక్షణ కల్పించాలని, కనీసం 10 లక్షల రూపాయలు ప్రోత్సాహకం అందించాలని, ఉపాధి మార్గాలను చూపించాలని డిమాండ్ చేశారు.

పరువు హత్యలు, దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

మహాత్మ జ్యోతిబాపూలే ఏ లక్ష్యం కోసం సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేశారో, ఆ లక్ష్యం కోసం పనిచేయాల్సిన కర్తవ్యం ప్రస్తుతం మరింత పెరిగిందన్నారు. సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో కుల నిర్మూలన కోసం మరింత చైతన్యవంతంగా పోరాడాలన్నారు. అరుణోదయ కళాకారులు తమ పాటలతో చైతన్యపరిచారు. ఈ సదస్సులో మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్, డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, బోధన్ డివిజన్ కార్యదర్శి డి. రాజేశ్వర్, సీఎల్సీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆల్గోట్ రవీందర్, మాస్ లైన్ జిల్లా నాయకులు కే.గంగాధర్ లు మాట్లాడారు. పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా నాయకులు బి.మల్లేష్, డి.కిషన్, బి.మురళి, పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి కే.సంధ్యారాణి, పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి కే.గణేష్ నాయకులు గంగమల్లు, గంగారం, శంకర్, నాగమణి, భాస్కర స్వామి, రమేష్, అమూల్య, చరణ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రతిపాదికన "మొక్కజొన్న" కొనుగోలు చేయాలి.

**దళారివ్యాపారులను అరికట్టాలి.**

**అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. ప్రభాకర్ డిమాండ్.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

యుద్ధ ప్రతిపాదికన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కొనుగోలులో దళారి వ్యాపారులను అరికట్టాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయుకేఎస్) రాష్ట్ర అధ్యక్షులు వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు

శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ కిరణ్ కు రెండు రోజులుగా వర్షాల్లో తడిసి ముద్ద అయినా మొక్క జొన్న పంటలను, ధాన్యం ను అఖిలభారత ఐక్య రైతు సంఘం( ఏఐయుకేఎస్), రైతు జేఏసిల ఆధ్వర్యంలో డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం ను అందజేశారు. ఈ సందర్భంగా వి. ప్రభాకర్ మాట్లాడుతూ, భారీ వర్షాలతో నోటికి కాడికి వచ్చిన మొక్కజొన్న, సోయా, వరి నీళ్ల పాలయిందనీ, వేల ఎకరాల్లో ఇసుక మేటలు వేసి రైతాంగానికి లక్షలాది రూపాయలు నష్టం కలిగించిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ అధికారులు నష్టం జరిగిన ఆంచనా వేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనాన్ని తెలియజేస్తుందని అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల్లో రాష్ట్రవ్యాప్తంగా 16, 17 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను మార్కెట్ తరలించడానికి రోడ్లపై ఆరబెట్టుకున్నారనీ, ఆ పంట కూడా ఉమ్మడి జిల్లాలో సుమారుగా లక్ష 50 వేల ఎకరాల్లో పంట నష్టపోయిందని, తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్థితిని పరిశీలించడానికి ఆర్మూర్ డివిజన్ రైతు జేఏసీ బృందం సభ్యులు. వి. ప్రభాకర్. యాదగౌడ్, లింగారెడ్డి, దేవారం, బి. కిషన్, టి. గంగాధర్, అర్గుల్ మాజీ సర్పంచ్ జగదీశ్వర్. తదితరులు చేపూర్ లక్కోరా గ్రామాల మధ్య రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్నలను పరిశీలించారు. వాటి వివరాలను ఈ సందర్భంగా జేసీ కి అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి. దేవారం, జిల్లా అధ్యక్షులు ఎస్. సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి బాబన్న, జిల్లా కార్యదర్శి దామోదర్, బి కిషన్, రైతు జేఏసి నాయకులు డి. లింగారెడ్డి, ఆలూరు. గంగారెడ్డి, బి. సర్పంచ్, బి. కిషన్, జి. ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## టీయూ సౌత్ క్యాంపస్ విద్యార్థిని గ్రూప్ 1కు ఎంపిక.

- అభినందించిన ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సుధాకర్ గౌడ్,



**వేగుచుక్క న్యూస్, బిక్నూర్**

: తెలంగాణ విశ్వవిద్యాలయం, సౌత్ క్యాంపస్ జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగానికి చెందిన, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని శ్రీజ గ్రూప్ 1 లో విజయం సాధించారు. కరీంనగర్ జిల్లాకు చెందిన రాధిక, జైపాల్ రెడ్డి ల కుమార్తె కంకణాల శ్రీజా రెడ్డి మొదటి ప్రయత్నంలోనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూప్- 1 ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 509 ర్యాంక్ ను సాధించి, మల్టీ జోన్ 1 కు ఎంపీడీవో గా ఎంపిక అయ్యింది. క్యాంపస్ లోని ప్రశాంతమైన వాతావరణం, అధ్యాపకుల సూచనల తో ఈ విజయం సాధించానని శ్రీజ అన్నారు. ఈ సందర్భంగా సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సుధాకర్ గౌడ్, మరియు డిపార్ట్మెంట్ అధ్యాపకులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. శ్రీజ ని ఆదర్శంగా తీసుకొని రానున్న రోజుల్లో విద్యార్థులు మరిన్ని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్, రిజిస్టర్ సహకారంతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సౌత్ క్యాంపస్ అధ్యాపక బృందం, మరియు విద్యార్థులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు



## మౌనాన్ని నేర్చుకున్నాక...



సంగీతాన్ని సాధన చేసినట్టు
ఇప్పుడు మౌనాన్ని సాధన
చేస్తున్నాను.

ఏ దృశ్యము, మాట, లోనికి
ఇంకకుండా వార్తలను
మోసుకొచ్చే అన్ని ద్వారాలను,
కిటికీలను, మూసేసి, చుట్టూ
చీకటి పరదాలు బిగించాను.
ఇప్పుడిక ఏది కనపడనట్లు,
వినపడనట్లు, మరేదీ మాట్లాడ
కూడదనట్లు

నాకు నేను లాలి పాటలు
పాడుకుంటాను.
నా స్వప్న లోకంలో అందమైన,
అద్భుత దృశ్యాలను చూసేందుకు
ఉన్మత్తనై ఎక్కడెక్కడో తిరుగుతాను.

లోపలి దుఃఖాలను, ఏకాకితనాలను
దాచుకొని
ఒక గంభీరపు ఆనందాల ముసుగు
ముఖానికి తగిలించి సభికుల
ముందు నృత్యం చేస్తాను.

నా ఏకాంతాల్లో తలవంచుకుని
మెల్లిగా వణుకుతున్న నా చేతులకి
కేసి తదేకంగా చూస్తాను.. అక్కడ నా
హృదయం ఏదో ఉన్నట్లు... అవి
చిరకాలంగా దాన్ని మోస్తున్నట్లు.. ఆ
చప్పుడు నాకు మాత్రమే
వినపడుతున్నట్లు...

ఇప్పుడు ఒకప్పటిలా బరికేసి
దేనికైనా సరే సవాలని నిలవలేను...
పొగరుగా తల ఎగరేసి కత్తులు
దూయలేను.

అన్యాయాన్ని చూసినప్పుడు
ఆగ్రహంతో చంపేందుకు,
చచ్చేందుకు సిద్ధమని.. ఒకప్పటిలా
కంట నిప్పుల్ని చెరగలేను.

బాధిత మానవుల వద్దకు రెక్కలు
కట్టుకొని వాలలేను
దుర్గమారణ్యాలలో సంచరిస్తూ
కూలిన వృక్షాలకు మళ్ళీ ప్రాణం
పోయలేను.

గాజా పిల్లల కళ్ళలోకి సూటిగా
చూడలేను.. విశ్వం అంతటా జరిగే
ప్రతి దుర్మార్గాన్నీ నిలువరించేందుకు
ఇంతకు ముందులా, సాహసంగా
ఎదురు వెళ్లలేను.

మన కోసం మరణించిన వాళ్ళ
పక్కనే నిలిచి
కాసిన్ని పూలుచల్లి తుది వీడ్కోలు
చెప్పలేను
ఇప్పుడు ఇంకా, ఇంకా ఎన్నెన్నో
చేయలేను.

ఈ చివరి వేళ నా ముసలితనపు
గుహలో దూరి ఏమీ పట్టనట్లు
ధ్యానంలో కూర్చుంటాను.

బయటి లోకానికీ, లోపల
ప్రయాణానికి మధ్య వేలాడుతున్న
వంతెనను కూల్చి వేసాను
అనుకుంటాను.

కానీ నా యోచనల
భూకంపాలని,
మేధో మధనాల సుడిగుండాలని.

నా ఊహలు, వాంఛలు చేసే
యుద్ధాలను ఆపడం వల్ల కాక. ఎటో
ఒక చోటుకు వెళ్లలేక, వున్న చోటునే
ఉండలేక.

నా లోలోపలే గిర్రున తిరుగుతాను
లోలకమై కాలపు గడియారంలో పడి
కొట్టుకుంటాను.

అప్పుడు నా హృదయం చెబుతుంది
నిజంగా తెలియని తనం వేరు..
తెలిసి, తెలిసి తలకెత్తుకునే మౌనం
వేరు అని.

నాకు మెల్లిగా చెదపురుగులు
కొంచెం, కొంచెం నన్ను తినేసి
డొల్ల చేయడం తెలుస్తుంది.

-విమల మోర్తాల.
26.9.2025

## విమర్శలతో పాపాలను కడక్కోలేరు

### ప్రజలకు అందుబాటులోకి రాని కెసిఆర్



బిఆర్ఎస్ విమర్శలు కోటలు దాటుతున్నాయి. ఓ వైపు హరీష్ రావు, మరోవైపు కెటిఆర్ చేస్తున్న విమర్శలు గురివింద సామెతను గుర్తు చేస్తున్నాయి. బంగారు తెలంగాణ జరిగివుంటే ఇన్ని సమస్యలు మళ్లీ ఎందుకు వచ్చాయన్నది ఆలోచించాలి. ఇకపోతే కెసిఆర్ సామాన్యులకు అందుబాటులో ఉండడన్న విషయం అధికారంలో ఉన్నప్పుడే అందరికీ తెలుసు. అలాగే అధికారం కోల్పోయినా అలాగే వ్యవహరిస్తున్నారు. ఉద్యమ సమయంలో కూడా అదే ధోరణి కనబర్చారు. ఆయన నేరుగా ప్రజలను కలుసుకునే వీలు లేకుండా తన వైఖరిని ధృడపర్చుకున్నారు. అందుకే ప్రజలు ఆయనను కలవడానికి అవకాశం లేదు. ప్రజలను కలవకుండా,నేతలతో చర్చించకుండా బలమైన నేతగా ఎక్కువ కాలం మనలేరని కూడా రుజువు చేసుకున్నారు. గత పదేళ్ల ఆయన పాలనలో తనకు తానుగా నిర్మించుకున్న ఇనుపగోడల కారణంగా ప్రజల అవసరాలను గుర్తించలేక పోయారు. సమస్యలను ప్రస్తావిస్తే దాటవేతలు లేదా విమర్శలు ఎక్కువయ్యాయి. తెలంగాణ ఏర్పడ్డది మొదలు ప్రజల పక్షాలన నిలిచి పనులు చేసుకుంటూ పోతే ఇవాళ బిఆర్ఎస్ ఇంతగా ఇతర పార్టీలను విమర్శించాల్సిన అవసరం ఏర్పడేది కాదు. ప్రజలను పట్టించుకుని ఉంటే తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన నేతగా కెసిఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. కానీ దాదాపు పదేళ్ల పాటు భరించారు. లాభం లేదనుకుని తీర్పు ఇచ్చారు. దీనిని బిఆర్ఎస్ నేతలు అర్థం చేసుకోవడం లేదు. తమ పదేళ్ల కాలంలో అంతా బ్రహ్మాండంగా చేశామని డప్పు కొట్టుకుంటున్నారు. అందుకే అదేపనిగా విమర్శల ద్వారా ప్రజల్లో ఉండాలని చూస్తున్నారు. వీరు గతంలోనే ప్రజలకు దగ్గరగా ఉంటే ఆ పార్టీని ప్రజలు విస్మరించేవారూ కాదు. కానీ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఇంకా కాంగ్రెస్,టిడిపి, బిజెపిలను తిడుతూ, సెంటిమెంట్‌ను రెచ్చగొడుతూ పోతే ఓట్లు రాలే పరిస్థితి ఇప్పుడు కూడా లేదు.

## ఆర్థిక వృద్ధిపై మొండి బకాయిలదెబ్బ

**ఎగవేత దారుల్లో కనిపించని భయం**

**సామాన్య ఖాతాదారులే బలిపశువులు**



ముంబయి: పెద్దలు ఎగవేసిన మొత్తాల కారణంగా సామాన్యులకు గుదిబండగా మారింది. సామాన్యులు రూపాయి బాకీ ఉన్నా ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకర్లు పెద్దల అప్పులపై నోరు మెదపడం లేదు. మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యాంకులు ఖాతాదారులపై ఇష్టం వచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నారు. కొన్ని కేసుల్లో రుణగ్రహీతలను వదిలి బ్యాక్ అధికారులను బాధ్యులను చేస్తున్నారు. అక్రమ రుణాలకు సహకరించిన బ్యాంక్ అధికారులు మాత్రం ఊచలు లెక్కిస్తున్నారు. ఇలాంటి వారి భరతం పట్టే ఉపాయాలు ఆలోచించడం లేదు. తాజాగా బ్యాంకుల్లో దోపిడీ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాకట్టు బంగారాన్నిమాయం చేస్తున్నారు. నకిలీ బంగారంతో రుణాలు ఇప్పిస్తున్నారు. బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదను మార్చేస్తున్నారు. ఇవి కొత్త తరహా మోసాలు బయట పడుతున్నాయి. సామాన్యుల రుణాల విషయంలో ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకులు పెద్దల విషయంలో మిన్నకుంటున్నారు. ఇకపోతే ఆయా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు చూస్తే బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తతమని ప్రజలు భావిస్తున్నారు. మరోవైపు పాతబకాయిల వసూలుకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండి బకాయిదారుల పేర్లను వెల్లడించాలని గతంలో సుప్రీం ఆదేశించినా ఎందుకనో ఆర్‌బిఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండి బకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల వివిధ బ్యాంకులు దాదాపుగా రూ.2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ గతంలోనే విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం యాభై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వీటి మొండిబకాయిలు రూ.4 లక్షల కోట్ల మేర ఉన్నాయి. 50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు. నిర్మాణ రంగం 25 శాతం, విద్యుత్ 15 శాతం చొప్పున బ్యాంకులకు నిరర్థక ఆస్తులను మిగిల్చాయి. బ్యాంకుల మొత్తం మొండి బాకీలు రూ.8 లక్షల కోట్లలో ఈ 50 కంపెనీల వాటా దాదాపుగా సగం మేర ఉన్నాయి. మొత్తం నిరర్థక ఆస్తుల్లో కనీసం సగానికి పైగా రుణాలు ఈ రంగాలివే. భారత జిడిపిలో ఇవి 5 శాతం. ఆర్థిక విలువ ఆధారితంగా ఈ రైటాఫ్ విలువను లెక్కించామని క్రిసిల్ రేటింగ్స్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

## బతుకమ్మ, బోనాలు.. తెలంగాణ అస్తిత్వం: సీతక్క



హైదరాబాద్ బతుకమ్మ, బోనాల పండుగలు తెలంగాణ అస్తిత్వమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ నెల 29న సరూర్‌నగర్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దఎత్తున మహిళలందరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అధ్యక్షతన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షుల సమావేశం శుక్రవారం గాంధీభవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా సీతక్క హాజరై మాట్లాడారు. 'కొంతమంది తామే బతుకమ్మను తెలంగాణకు నేర్పించామని ప్రచారం చేసుకున్నారు. తెలంగాణ ఉనికిలోకి వచ్చినప్పటి నుంచి బతుకమ్మ పండుగ ఉంది. బతుకమ్మలో కొత్త సంస్కృతులు వద్దు. సంప్రదాయ పద్ధతిలోనే బతుకమ్మ ఆడాలి. ప్రభుత్వం చేపడుతున్న మహిళా సంక్షేమ కార్యక్రమాల్లో మహిళా కాంగ్రెస్ భాగస్వామ్యం కానుంది. వారిని మరింత బలోపేతం చేస్తాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాదు.. వారిని బస్సు యజమానులను చేశాం' అని సీతక్క పేర్కొన్నారు. అనంతరం వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతిని, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని మంత్రి సీతక్క వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.